
# నామీద కథ రాసుకోండి




పైడిపాల

ఎదురు చూసిన మనుషులు, ఉత్తరాలు రాకపోతే నేను చాలా డీలా పడిపోతాను. కాని జీవితంలో చాలాసార్లు రాకపోవడమే జరిగినా ఇంకా నేనుమాత్రం ఎదురుచూడ్డం మానలేదు. రెండ్రోజులుగా రాధ నుంచి ఉత్తరం కోసం ఆవురావురు మంటున్నాను. నిన్న, మొన్న- పోస్టుమాన్ కోసం పడిగాపులు కాసే ఓపికలేక పోస్టాఫీసుకివెళ్ళి 'నాకేమైనా ఉత్తరాలున్నాయా?' అని అడిగేవాణ్ని. తిలక్ 'తపాలా బంట్రోతు' కవితలోలా 'అతని మొహం మీద లేదని చెప్పడానికి బదులు చిరునవ్వు నా ఆత్రుతని గమనించిన పోస్టుమేన్' ఈరోజు అనుకోనంత పెందరాళే 'మాష్టారూ ఇదిగో మీకో లెటరు' అంటూ చేతికందించి ఓ నిముషం నా కళ్ళలోకి చూస్తూ ఆగాడు.

కవరుమీద దస్తూరీ చూడగానే 'ఇదికాదు రావాల్సింది' అన్నాను— పోస్టుమాన్ మొహం నిండా సానుభూతి ఒలకబోసి వెళ్ళిపోయాడు

ఫ్రమ్ అడ్రసు కూడా లేని ఆ అపరిచితమైన అక్షరాల్ని చూసి ఆశ్చర్యపడుతూ కవరు చించాను.

నా అభిమాన రచయిత వనమాలి గార్కి నమస్సులు.

ఆశ్చర్యపోతున్నారా ? – ఈ అపరిచిత అభిమాని ఎవరని! బహుశా మీకున్న వేలాది అభిమాన పాఠకుల్లో నేనొకణ్ణి కావచ్చు. కాని నాకున్న వేళ్ళమీద అభిమాన రచయితల్లో మీరొకరు. నా పేరు శరత్‌బాబు. ఊరు తూర్పు గోదావరి జిల్లాలోని వసంతపురి. మీ కవితలన్నా, కథలన్నా నేను చెవికోసుకుంటాను. రెండువారాల క్రితం అచ్చయిన మీ కవిత 'పుష్పలావిక'ను ప్రశంసిస్తూ ఈ వారం పత్రికలో నేను రాసిన ఉత్తరం మీరు చూసే వుంటారు. ఆ కవిత నాకు ఎంతగా నచ్చిందో ఆ వుత్తరంలో రాశాను. కనుక ప్రత్యేకంగా యిక్కడ రాయడంలేదు. నాకు సాహిత్యాభిరుచి ఏర్పడే వయసువచ్చేసరికే మీరు చాలా కవితలు, కథలు రాసివుండడం వల్ల మీ రచనలన్నీ చదివే అదృష్టం నాకు లభించలేదు. కథారచనలో మీది ప్రత్యేకమైన బాణీ. మీలా శిల్పానికి ప్రాధాన్యమిస్తూ చదివించే వేగం వున్న కథలు రాసేవారంటే నాకు భలే యిష్టం. కాని ఈమధ్య ఎందుకో మీరెక్కువగా కథలు రాయకపోవడం నావంటి అభిమానులకు నిరాశకలిగిస్తోంది.

అదృష్టవశాత్తు ఈ వారం పత్రికలో మీ కవితా సంపుటి 'వాసక సజ్జిక'' కథల సంపుటి 'సగం చెక్కిన రాతిరథం'మీద వచ్చిన సమీక్షలు చదివాను. దయచేసి ఆ రెండు కాపీలు నాకు ఉచితంగా పోస్టుద్వారా పంపిస్తారని ఆశిస్తున్నా.

పన్నెండు రూపాయల ఖరీదయిన పుస్తకాలను ఇలా పంపమని అడగడం సమంజసం కాదు గాని నేను పుస్తకాలు సొంతంగా కొని చదవలేని పేదవాణ్ని. ఆపైన మావూరు సాహిత్య గ్రంథాలు కొనడానికిగాని గ్రంథాలయాల్లో చదువుకోడానికికాని అవకాశం లేని పల్లెటూరు అంచేత నేను నా అభిమాన రచయితలందరి పుస్తకాలూ సేకరించి నా సొంత గ్రంథాలయంలో భద్రపరుస్తున్నా. ఈ అభిమాని కోరికను మీరు నిరాకరించరని నమ్ముతున్నా.

నా గురించి... బి.ఏ. చదివి ఖాళీగా వున్న నిరుద్యోగిని. పుస్తకపఠనం హాబీ. అడపాతడపా పత్రికలకు ఉత్తరాలు,కథలు రాస్తుంటాను. మీ జవాబుకోసం ఎదురు చూస్తుంటాను—

మీ అభిమాని,

శరత్‌బాబు.

# నామీద కథరాసుకోండి

ఇదివరకు కూడా కొందరు అభిమానుల నుంచి నాకు ఉత్తరాలు వచ్చాయి. కాని యిలా మొదటి ఉత్తరంలోనే పుస్తకాలు పంపమనే చనువు తీసుకుంటూ కాదు. పైగా నేను శరత్ బాబు రాసినట్టు వేలసంఖ్యలో అభిమానులుండే పేరు ప్రఖ్యాతులున్నంత ప్రసిద్ధ రచయితను కాదు. కాని ఇతని ఉత్తరంలో పొగడ్తలతోబాటు కొన్ని నిజాలూ ఉన్నాయి— ఆ పైన నిజాయితీ వుంది. కేవలం పుస్తకాల కోసమే అయితే ఏ అమ్మాయి పేరుతోనో ఉత్తరం రాసుండేవాడు కాని ఇతనెవరో కొంత సాహిత్య పిపాస ఉన్నవాడిలాగే కనిపిస్తున్నాడు. అయినా రచయితగా నాకుండే 'అహం' శరత్‌కి పుస్తకాలు పంపించడానికి అంగీకరించలేదు.

దాదాపు ఓ నెల గడిచిన తర్వాత ఓ అత్యధిక ప్రచారంగల వారపత్రికలో అచ్చయిన నాకథ 'రచయితా, కథలు చెప్పకు' మీద నా అభిమానులు కొందరు నేరుగా నాకుఉత్తరాలు రాశారు. అలా వచ్చిన ఉత్తరాల్లో శరత్ బాబుది ఒకటి —

"......... మీ కథ చదివాను మంచి ప్రారంభం, ముగింపు ఎన్నుకోవడంలో మీరు చూపిస్తున్న శ్రద్ధ, ప్రతిభ ప్రశంసనీయాలు. కథాంతంలో కొస మెరుపు మీ ప్రత్యేకత. ఇలాంటి కథలకు మార్గదర్శకులు మొపాసా, ఓ హెన్రీ... అని నేను విన్నాను ఇలాంటి ఉత్తమమైన కథలు రాసే మీరు బద్ధకించడం చాలా అన్యాయం. అవునూ—కథలు రాయడానికే కాకుండా జాబులు రాయడానికి కూడా మీకు బద్ధకమా ? కిందటి సారి నేను రాసిన ఉత్తరం మీకు అందే వుంటుంది. మీ మంచి జాబుకు కాని, పుస్తకాలకు కాని నేను నోచుకో లేదు. ఈ నిరుద్యోగిని కనికరించమని వేడుకొంటున్నా.

త్వరలో మా ఊళ్ళో ఒకసాహితీ సంస్థను ఏర్పాటు చేసి మీ వంటి ప్రముఖులను నెలనెలా ఆహ్వానించి మీసందేశాలు వినాలని కుతూహలపడుతున్నాం. ఆ సంస్థకి ఓ మంచి పేరు సూచిస్తే కృతజ్ఞులం. నేను రాసిన కవిత ఒకటి ప్రచురిస్తున్నట్టు 'యువగళాలు' పత్రిక వారు తెలియజేశారు.

మీ జాబు కోసం ఈ క్షణంనుంచి ఎదురు చూస్తూ— మీ అభిమాని

శరత్ బాబు.

ఆ రోజే అతనికి రెండు పుస్తకాలు పోస్టు చేస్తూ సమాధానం కూడా జతపరిచాను పుస్తకాలు అందినట్టు కృతజ్ఞతలు తెలియజేస్తూ వెంటనే అతని నుంచి జవాబు వచ్చింది ... ఆ తర్వాత అతనివి తరచుగా పత్రికల్లో ఉత్తరాలు చూస్తున్నాను

* * *

హైదరాబాదు 'స్టేట్ వేల్యుయేషన్' కి వెళ్ళినప్పుడల్లా 'ఫుట్‌పాత్'మీదఅమ్మే సెకండ్ హాండ్ పుస్తకాలమీద దాడి చెయ్యడం నా కలవాటు ఆ ఆదివారం నాంపల్లి నుంచి ఆబిడ్స్‌కి వెళ్ళేదారిలో ఓ సెకండ్ హాండ్ పుస్తకాల షాపు ముందు ఆయిదారు మంది మూగి వున్నారు ఎక్కువ మంది ఎగబడేచోట మంచి సరుకుంటుందని చాలా మంది అభిప్రాయం ఆ వుద్దేశ్యంతోనే నేనూ వారిలో చేరాను. నిజంగానే చాలా మంది ప్రముఖ రచయితల పుస్తకాలూ, కొన్ని అచ్చులో లేని అరుదైన పుస్తకాలూ అక్కడున్నాయి. వాటిలో అయిదారు పుస్తకాలు ఎంపిక చేశాను. మరికొన్నిటి కోసం వెతుకుతుండగా — నా కథా సంకలనం 'సగం చెక్కిన రాతి రథం' కనిపించింది.

పత్రికల్లో నా రచనలు అచ్చయిన పేజీ లుగల కాగితాలు పచారీ కొట్లలోనూ,పకోడీపొట్లాల రూపంలోనూ కనిపించినపుడు అమితంగా బాధపడి పోయే తత్వం నాది. అలాంటిది నా పుస్తకమే అక్కడ కనిపిస్తే నా దుఃఖం చెప్పాలా? మరి ప్రముఖరచయితలు ఆ స్థితిలో తమ పుస్తకాల్ని చూసి ఎంత బాధపడతారో— అలా బాధ పడ్డం ఎంతవరకు సబబో ఆలోచించే శక్తిలేదు నాకు ఈ లోగా మిత్రుడు మూర్తి 'ఏయ్, మాలీ నీ పుస్తకం...' అంటూ నా సంకలనాన్ని అందుకొని చూడ్డం నా దుగ్ధని రెట్టింపు చేసింది—ఏదో సామెత చెప్పినట్టు.

"ఏదో కాంప్లిమెంటరీ కాపీ అయి వుంటుంది" అంటూ లోపల పేజీలు చూశాను 'శరత్ బాబుగార్కి అభినందనలతో', అంటూ రాసిన అక్షరాలు నన్ను వెక్కిరించాయి కోపంతో అవమానంతో నామొహం ఎర్రబారిపోయింది. నేను కొనదలచుకొన్న మిగతా పుస్తకాలతో బాటు నా పుస్తకం కూడా కలిపి దాదాపు మూడోవంతు ఖరీదుకి కొనుక్కున్నాను.

"శరత్ బాబు అంటే...వసంతపురి అతనే కదూ ?" కోపంతో బిగిసిపోయి 'ఫుట్‌పాత్' మీద నడుస్తున్న నన్ను కదిలించాడు మూర్తి.

" అవును–నీకెలా తెలుసు ?" ఆశ్చర్య పడుతూ అడిగాను

" నీకు తెలిసినట్టే. నిన్ను పొగుడుతూ నీకథా సంకలనంపంపమని ఉత్తరం రాశాడా?"

"అవును – అయితే నీక్కూడా .. ?" తెల్లమొహం వేశాను.

"అవును ." వేదాంతిలా చిరునవ్వు నవ్వుతూ తలూపాడు మూర్తి

అవును. ఆ శరత్ మోసగాడే ! నా అవసరం తీరిన తర్వాత నాకు మళ్ళీ ఉత్తరాలు రాయక పోవడం నాకు గుర్తొచ్చింది. ఆ మర్నాడు నా ఆగ్రహాన్నంతా అక్షరాలుగా మార్చి రాసిన ఉత్తరానికి శరత్ నుంచి తిరుగు టపాలో 'ప్రాంప్ట్' గా సమాధానం వచ్చింది–గౌరవనీయులు వనమాలి గార్కి —

నమస్కారం. మీరు చాలా కోపంగా రాసిన ఉత్తరం అందింది నేను వంచకున్నాని నిదించారు .. నేను చేస్తున్నది వంచన కాదు — వ్యాపారం నేను నిజంగా సాహితీప్రియుణ్నే. కాని నిరుద్యోగులం కావడం వల్ల మా అభిలాష తీర్చుకోడానికి నేనూ నా మిత్రుడూ కలిసి ఈ స్వయం ఉపాధి పథకాన్ని రూపొందించాం పోస్టేజి మా పెట్టుబడి హైదరాబాదులో మీకు సెకండ్ హాండ్ పుస్తకాల నమ్మింది నా మిత్రుడు, పార్ట్నర్ భరత్.

రచయితల బలహీనత నాధారంగా చేసుకొని వారిని పొగిడి పుస్తకాలు సేకరించి, నా మిత్రుడికి పంపిస్తుంటాము మొదటిపేజీ సాధారణంగా చించేస్తుంటాను. కాని మీ పుస్తకంలో మూడోపేజీలో 'కాంప్లిమెంట్స్' రాయడం వల్ల చించడానికి వీలు పడలేదు. మీకు దొరికిపోయాను కాని మీరనుకున్నట్టు అడ్డమైన రచయితల పుస్తకాలకోసం నేను ఉత్తరాలు రాయను వారివైతే కేజీల లెక్కన అమ్ముకోవాలి మాకు వ్యాపారం కిట్టుబాటు కాదు .. ఎంతో కొంత పేరున్న వాళ్లవైతేనే మాకు అమ్ముడవుతాయి.

పోతే, మీకు నష్టం, కష్టం కలిగించినందుకు మన్నించమని కోరుతూ — వాటికి పరిహారంగా ఓ సలహా యిస్తున్నా–మీ చేతిలో పని– నా మీద ఓ కథ రాసుకోండి.

క్షమాపణలతో,

శరత్‌బాబు ★